దుఃఖకారణం బయటలేదు నీలోపలే ఉంది. ఆ కారణం ఏమిటో నీవు వెతికి పట్టుకొని దానిని తొలగించుకోవాలి. ఆ ప్రయత్నం నీవే చేయాలి. నీబుద్ధిసూక్ష్మత అక్కడ ఉపయోగించుకోవాలి. నీవు ఎంతో కొంత ప్రయత్నం చేస్తేనే గాని ఆ బంధం తెగదు. గురువు నీకు సహాయం చేస్తాడు. నీవు చైతన్యభావన పెంచుకోవాలి. అది పెంచుకుంటూ ఉంటే జీవభావన దాని అంతట అదే పోతుంది. తల్లి చూడండి పిల్లలకు ఏది ఇష్టమో అది చేస్తుంది. తనకు ఇష్టం లేకపోయినా అదే తింటుంది. అలాగే మనం కూడా మన ఇష్టాన్ని ప్రక్కకు పెట్టి భగవంతునికి ఏది ఇష్టమో అది చేస్తూ ఉంటే ఈ జన్మలోనే ఇక్కడే మోక్షం వస్తుంది. దేహానికి పెట్టే ఆహారం మనం ఆపక్కరలేదు, దానికి యుక్తంగా పెట్టు. కాని దేహాభిమానానికి వెళ్ళే ఆహారాన్ని ఆపు చేస్తే దేహం ఉండగానే నీవు ఈశ్వర స్వరూపాన్ని పొందుతావు, జీవన్ముక్తుడవు అవుతావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

**(15-2-99, బిరుసుమర్రు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహం ఉండగానే జ్ఞానసముపార్జన కోసం మనం ప్రయత్నంచేయాలి. భగవంతుని యందు, భగవంతుడు చెప్పిన మాటయందు పరమప్రీతి కలిగిఉండాలి. భగవంతుడు చెప్పిన మాట నీకు ఇష్టం లేకపోయినా ఇష్టం చేసుకొని దానిని ఆచరించాలి. ఏదైతే మనకు శ్రేయస్సో అదే మనకు భగవంతుడు బోధిస్తాడు. కాని పాడుస్నేహాల వలన, ప్రకృతితో కలసిపోవటం వలన మనం పతనమయ్యాము. చెడుస్నేహాల వలన పచ్చగా ఉన్న సంసారములు పాడైపోతాయి. అందువలన స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. భగవంతుని అవతారములలో ఏదో ఒకదానిని మనం ఉపాసన చేయాలి. దానివలన మనో నిగ్రహం కలుగుతుంది.అప్పుడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది.అంతర్ దృష్టి కలిగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీవు మనస్సు చెప్పినట్లు వినకూడదు. మనస్సు వాసనచేత ప్రేరేపింపబడి పని చేస్తుంది. నీ వాసనను, మనస్సును ప్రక్కన పెట్టి, దాని గమనాన్ని పట్టించుకోకుండా ఈశ్వరుడు ఏదైతే చెప్పాడో దానికి అనుగుణంగా జీవిస్తే నీకు జ్ఞానం కలుగుతుంది. మన దేశభక్తి నిజమైతే మన మనస్సు విశాలమవుతుంది అది దైవభక్తికి దారి తీస్తుంది. బుడగను ఊదుతూ ఉంటే అది పెద్దది అయి, పెద్దది అయి చివరకు పేలిపోతుంది. అలాగే మన దేశ భక్తి నిజమైతే మన కార్యరంగ పరిధి పెరుగుతుంది. మనస్సు విశాలమై చివరకు మనస్సు నశిస్తుంది. అప్పుడు భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు.నీవు

నోటితో భగవంతుని స్తోత్రం చేస్తున్నావు. కాని చేతితో భగవంతునికి ఇష్టమైన పనిని చేయటం లేదు. మనం నోటితో చెప్పేది ఒకటి, చేతితో చేసేది ఒకటి. మనకు లోపల సమన్వయం లేదు. భగవంతుడు చెప్పిన మాటలకు అనుగుణంగా నీ చేతితో పని చేసి చూపించు.పని చేసేటప్పుడు ప్రేమ కలిగిఉండు, భక్తి కలిగిఉండు, ఎరుక కలిగిఉండు. మనం ఏదైనా పని చేసేటప్పుడు భగవంతుడు మనకు ఈ అవకాశం ఇచ్చాడు కాబట్టి చేస్తున్నాము అని అనుకోవాలి గాని నేను చేస్తున్నాను అని అనుకోకూడదు. భగవంతుడు ఏదైనా అవకాశం ఇస్తే మనం చేయగలం గాని లేకపోతే మనం ఏమీ చేయలేము. నీ మనస్సు నిర్మలం అయితే గాని, నిశ్చలం అయితే గాని, వస్తువు యొక్క తత్వం తెలియదు. నోటితో తియ్యగామాట్లాడు, చేతితో పూజ చెయ్యి, మనస్సుతో ధ్యానం చెయ్యి. అప్పుడు నీ మనస్సు నిర్మలం అవుతుంది,నిశ్చలం అవుతుంది. అప్పుడు నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అవగాహన అవుతుంది.

నీవు పని చేసేటప్పుడు గుర్రంలాగ పని చెయ్యి, జీవించేటప్పుడు సన్యాసిలాగ జీవించు గుర్రం ఎంత చురుకుగా ఉంటుందో అంత చురుకుగా పని చెయ్యి, సన్యాసిలా జీవించు అంటే సన్యాసికి అవసరాలు ఏమీ ఉండవు, పని చేస్తాడు. మనం పని చెయ్యము అవసరాలు కావాలి. అలా కాకుండా తక్కువ అవసరాలతో జీవించు,ఎక్కువ పని చెయ్యి. మనం ఇంద్రియాలతో ఏ పని చేస్తున్నా మన మనస్సుకు అనుబంధం దేవునితో ఉండాలి. భగవంతునితో మానసికఅనుబంధం కలిగి ఉండాలి. నిన్ను ఏ పాత్ర పోషించమని భగవంతుడు ఈ భూమి మీదకు పంపాడో దానిని సక్రమంగా పోషించు. దానితో తాదాప్యం చెందకు. అప్పుడు నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది ఎక్కడైతే పరమేశ్వరుడున్నాడో అక్కడకు నీ మనస్సు కొంచెం కొంచెంగా జరుగుతూ ఉంటుంది. మనస్సు ఎక్కడైతే ఉదయించిందో అక్కడకు వెళ్లి అది కరిగిపోతుంది. అప్పుడు నీవు ఎవడిగా ఉన్నావో ఆ వస్తువు నీకు వ్యక్తమవుతుంది. ఆ వస్తువు వ్యక్తమయ్యాక ఇప్పుడు నీవు ఎత్తిన జన్మలు అన్నీ స్వప్నంతో సమానం అని నీకు తెలుస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. నీవు ఆత్మజ్ఞాన సముపార్జనలో లగ్నమై ఉండు. దేనిని తెలుసుకున్నాక ఇంక తెలుసుకోవలసింది ఏదీ ఉండదో, ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి మించిన సుఖం గాని, దానితో సమానమైన సుఖంగాని లేదు అని నీకు తెలుస్తుందో అటువంటి సుఖాన్ని పొంది నీవు సుఖివి అవ్వు.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL